సాక్షి

శ్రీసత్యసాయి జిల్లా

ఆదివారం । 25 । ఫిబ్రవరి । 2024



చీనీ టన్ను రూ.20 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.20 వేలు పలికాయి. కనిష్టంగా రూ.10 వేలు, సరాసరిన రూ.15 వేల ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



టమాట కిలో రూ.12

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.12 పలికింది. కనిష్టంగా రూ.4, సరాసరిన రూ.8 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం

37.7°/ 17.3°

జిల్లాలో శనివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. కొన్ని ప్రాంతాల్లో ఉదయం చలి వాతావరణం కొనసాగింది. గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో తూర్పు దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

26 నుంచి శనగ కొనుగోళ్లు



పుట్టపర్తి టౌన్: జిల్లాలోని రైతు భరోసా కేంద్రాల ద్వారా ఈనెల 26 నుంచి శనగ కొనుగోళ్లు చేపట్టనున్నట్లు మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ గీతమ్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం క్వింటాకు రూ.5,440 మద్దతు ధర ప్రకటించిందన్నారు. ఈ మేరకు రబీలో రైతులు పండించిన పప్పుశనగ కొనుగోలు చేయనున్నట్లు ఆమె వెల్లడించారు. శనగ సాగు చేసి ఈ–క్రాప్‌లో నమోదు చేసుకున్న రైతులు రైతు భరోసా కేంద్రాల్లో సంప్రదించి వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.

'శ్రీ సత్యసాయి' కలెక్టర్‌కే ఆ 3 మండలాల ఎన్నికల బాధ్యత

అనంతపురం అర్బన్: రాప్తాడు నియోజకవర్గ పరిధిలోని కనగానపల్లి, రామగిరి, చెన్నేకొత్తపల్లి మండలాల్లో ఎన్నికల నిర్వహణ బాధ్యత శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్‌కు అప్పగిస్తూ ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాల పునర్విభజన నేపథ్యంలో ఆ 3 మండలాలు ఇప్పటికే శ్రీ సత్యసాయి జిల్లా పరిధిలోకి వెళ్లాయి. ఎన్నికల నిర్వహణ బాధ్యతలు మాత్రం పూర్వపు జిల్లా ఉన్నతాధికారులే చూసేవారు. పరిపాలనా సౌలభ్యం దృష్ట్యా తాజాగా కొత్త జిల్లా కలెక్టర్‌కే ఆ 3 మండలాల ఎన్నికల బాధ్యతలు అప్పగించారు. దీంతో అనంతపురం జిల్లాలోని పోలింగ్‌కేంద్రాల సంఖ్య తగ్గింది. ఇప్పటివకూ 8 నియోజకవర్గాల పరిధిలో 2,213 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. తాజాగా 3 మండలాల్లోని 111 పోలింగ్ కేంద్రాలు శ్రీసత్యసాయి జిల్లా పరిధిలోకి వెళ్లడంతో 2,102కి తగ్గింది.

అగ్రగామిగా జేఎన్‌టీయూ



మాట్లాడుతున్న న్యాక్ పీర్ కమిటీ సభ్యులు

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం అగ్రగామిగా రూపుదిద్దుకుందని న్యాక్ పీర్ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. న్యాక్ పీర్ కమిటీ మూడు రోజుల పర్యటన అనంతరం యూనివర్సిటీ ఉన్నతాధికారులతో శనివారం ఎగ్జిట్ సమావేశాన్ని నిర్వహించి పలు అంశాలపై సమీక్ష చేశారు. జేఎన్‌టీయూ అనంతపురం వీసీ ప్రొఫెసర్ జీవీఎస్ శ్రీనివాసరావు ప్రజెంటేషన్ ఇచ్చారు. తొలి రోజు ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి, జేఎన్‌టీయూఏ వీసీ శ్రీనివాసరావు, రెక్టార్ ప్రొఫెసర్ ఎం.విజయ కుమార్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి.శశిధర్ సమావేశమయ్యారు. రెండో రోజు న్యాక్ పీర్ కమిటీ మూడు బృందాలుగా విడిపోయి వర్సిటీలోని అన్ని విభాగాలను సందర్శించారు. చివరి రోజైన శనివారం డైరెక్టర్లు, బోధన, బోధనేతర, విద్యార్థులతో న్యాక్ పీర్ కమిటీ పలు సలహాలు, సూచనలు చేశారు. ఐక్యూఏసీ డైరెక్టర్ ప్రొఫెసర్ జీవీ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిరసనాగ్రహం

జై కొట్టిన తమ్ముళ్లే చంద్రబాబు డౌన్‌డౌన్ అంటూ నినదించారు. ఇన్నాళ్లూ పార్టీ జెండాలు మోసిన వారే కిందపడేసి తొక్కారు. మీ నిర్ణయం మార్చుకోండి..లేకపోతే మా నిర్ణయం మేం తీసుకుంటామంటూ అల్టిమేటం జారీ చేశారు. టీడీపీ– జనసేన ఉమ్మడి అభ్యర్థుల జాబితా ప్రకటన తెలుగు తమ్ముళ్లకు ఆగ్రహం తెప్పించింది. నమ్ముకున్న వారికి అన్యాయం చేశారంటూ పలుచోట్ల రోడ్డెక్కి నిరసన తెలిపారు.



పెనుకొండలో బీకే పార్థసారథి ఇంటి ముందు టీడీపీ కరపత్రాలు, ఫ్లెక్సీలు, ఇతర సామగ్రిని దహనం చేస్తున్న తెలుగు తమ్ముళ్లు

టీడీపీ- జనసేన అభ్యర్థుల జాబితాపై తమ్ముళ్ల ఆగ్రహం

- అన్యాయం చేశారంటూ ఆందోళనలు
- పెనుకొండలో చంద్రబాబు ఫ్లెక్సీలు చించేసిన తమ్ముళ్లు
- మడకశిరలో అభ్యర్థి సునీల్‌పై 'గుండమల' వర్గం చెప్పులదాడి
- ధర్మవరం, పుట్టపర్తి, కదిరి స్థానాలు తేలక నేతల అయోమయం

సాక్షి, పుట్టపర్తి/పెనుకొండ/ మడకశిర: టీడీపీ అభ్యర్థుల తొలి జాబితా విడుదలతో తమ్ముళ్ల వర్గపోరు రచ్చకెక్కింది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో నిరసనాగ్రహం వ్యక్తమైంది. టికెట్ ఆశించి భంగపడ్డ వర్గం అధిష్టానంపై అసమ్మతి వ్యక్తం చేసింది. టీడీపీ వెంట నడిచేది లేదని తేల్చిచెప్పింది.

చంద్రబాబు డౌన్‌డౌన్

పెనుకొండ ఇన్‌చార్జిగా ఉన్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథిని సంప్రదించకుండా సవితమ్మకు టికెట్ ఖరారు చేయడంపై ఆగ్రహ జ్వాలలు రేగాయి. బీకే పార్థసారథి ఇంటి ముందుకట్టిన చంద్రబాబు, లోకేష్‌ల ఫ్లెక్సీలను చించివేశారు. బీకే ఇంట్లో ఉంచిన టీడీపీ కరపత్రాలు, ఇతర ప్రచార సామగ్రిని రోడ్డుపైవేసి కాల్చేశారు. 'చంద్రబాబు, లోకేష్ డౌన్ డౌన్' అంటూ నినాదాలు చేశారు. పెనుకొండలో దమ్ముంటే గెలవాలని ఛాలెంజ్ చేశారు. చంద్రబాబు, లోకేష్ కుట్రపన్ని బీకే పార్థసారథి రాజకీయ జీవితంతో ఆడుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పలువురు నాయకులు, తెలుగు మహిళలు బీకే ఇంటి వద్దకు చేరి బీసీ వర్గానికి అన్యాయం చేశారని బిగ్గరగా రోదించారు. అనంతరం వారంతా తమ పదవులకు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. రానున్న ఎన్నికల్లో సవితమ్మను ఓడించడమే లక్ష్యంగా పని చేస్తామన్నారు. టీడీపీ ముఖ్య నాయకులు చినవెంకటరాముడు, రొద్దం నరసింహులు, నరహరి, చిన్నప్పయ్య, సాయిప్రసాద్ తదితరులు ఉన్నారు. మరో వైపు అనంతపురంలోని బీకే పార్థసారథి నివాసం వద్ద ఉన్న టీడీపీ ఫ్లెక్సీలనూ బీకే అభిమానులు చించేశారు.

ఈరన్న, సునీల్‌పై చెప్పులదాడి

మడకశిర టీడీపీ టికెట్ ఈరన్న తనయుడు సునీల్‌కుమార్‌కు ఇవ్వడంపై ఒక్కసారిగా తెలుగు తమ్ముళ్లలో ఆగ్రహం పెల్లుబుకింది. చంద్రబాబు టికెట్ ప్రకటించగానే మాజీ ఎమ్మెల్యే ఈరన్న, తనయుడు సునీల్‌కుమార్‌ను తీసుకుని మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఇంటికి వెళ్లారు. అప్పటికే గుండుమల ఇంటి వద్ద గుమిగూడిన వందలాది మంది ఆయన అనుచరులు... ఇంట్లోకి రాకుండా ఈరన్న, సునీల్‌కుమార్‌ను అడ్డుకున్నారు. ఈ సందర్భంలోనే కొందరు ఈరన్న, సునీల్‌పై చెప్పులతో దాడి చేశారు. దీంతో ఈరన్న, సునీల్‌కుమార్ అక్కడి నుంచి వెనుదిరిగారు. అనంతరం 'గుండుమల' తన అనుచరులతో సమావేశాన్ని నిర్వహించారు. సునీల్‌కుమార్‌కు సహకరించబోమని స్పష్టం చేశారు. అనుచరులు కూడా తమ పదవులకు మూకుమ్మడిగా రాజీనామాలు చేస్తామని తెలిపారు. అధిష్టానం నిర్ణయం మార్చుకోకపోతే ఇండిపెండెంట్‌గా పోటీలో దిగాలని నిర్ణయించారు.

శ్రీరామ్ అవుట్...పల్లెకు డౌట్..!

టీడీపీ తొలి జాబితా తర్వాత టీడీపీ నేతల్లో చాలా అనుమానాలు నెలకొన్నాయి. రాప్తాడు, పెనుకొండ, హిందూపురం, మడకశిర సీట్లు ప్రకటించిన చంద్రబాబు... ధర్మవరం, పుట్టపర్తి, కదిరి సీట్లు ఖరారు చేయకపోవడం అందరినీ ఆలోచనలో పడేసింది. ధర్మవరం సీటును బీజేపీ, పుట్టపర్తి లేదా కదిరి సీటును జనసేనకు ఇస్తున్నారన్న ప్రచారం సాగుతోంది. దీంతో పరిటాల శ్రీరామ్‌కు ఈ సారి టికెట్ లేనట్లే అని తెలుగు తమ్ముళ్లే తెలుస్తోంది. ఇక పుట్టపర్తి సీటును జనసేన ఆశిస్తోందని, అందువల్లే చంద్రబాబు తొలి జాబితాలో పల్లె రఘునాథరెడ్డి పేరు ప్రకటించలేదని చర్చ జరుగుతోంది, అయితే పల్లె రఘునాథరెడ్డి మాత్రం తనకే టికెట్ వస్తుందని గంపెడాశలతో ఉన్నారు.



పెనుకొండలో ఫ్లెక్సీలను చించిన దృశ్యం



మడకశిరలో ఈరన్నను అడ్డుకుంటున్న దృశ్యం

కందికుంటకు టికెట్ లేనట్టే..!

కదిరి: టీడీపీ కదిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ కందికుంట వెంకట ప్రసాద్‌కు ఈసారి ఎన్నికల్లో టికెట్ ఉండకపోవచ్చని ఆ పార్టీ వర్గాలు అంటున్నాయి. ఆయనపై నకిలీ డీడీల కేసు ఉన్నందున... ఈ కేసు నుంచి బయట పడేవరకూ తాను ఏ ఎన్నికల్లోనూ పోటీ చేయనని ఆయనే స్వయంగా సుప్రీంకోర్టులో అఫిడవిట్ ఇచ్చారని టీడీపీ లీగల్ వ్యవహారాలు చూసే ఒకరు తెలిపారు. అందుకే శనివారం టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించిన ఆ పార్టీ అభ్యర్థుల తొలి జాబితాలో కదిరి స్థానం నుంచి ఎవరన్నది ప్రకటించలేదన్నారు. తనపై కేసు ఉన్నందుకు తన భార్య కందికుంట యశోదమ్మకు టికెట్ ఇవ్వాలని కందికుంట పార్టీ అధిష్టానాన్ని కోరారని, దీనిపై పార్టీ ఇంకా నిర్ణయం తీసుకోలేదని తెలిసింది. కానీ కందికుంట, ఆయన సతీమణి రెండు రోజుల క్రితం నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. తనకు కాకపోతే తన భార్యకు టికెట్ గ్యారంటీ అని కందికుంట ధీమాగా చెబుతున్నారని అనుచరులు అంటున్నారు. మరోవైపు మలి జాబితాలో కదిరి అభ్యర్థిగా తన పేరు ప్రకటిస్తారని మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా ధీమా వ్యక్తం చేస్తున్నారు. అయితే పొత్తులో భాగంగా ఈసారి కదిరి టికెట్ బీజేపీకి కేటాయిస్తారని ఆ పార్టీ నాయకులు అంటున్నారు. ఏది ఏమైనా ఈసారి కందికుంట బరిలో ఉండరని ఆ పార్టీ నాయకులే బహిరంగంగా చెబుతున్నారు.

రాజీనామాల పర్వం

టీడీపీ– జనసేన ఉమ్మడి అభ్యర్థుల ప్రకటన టీడీపీలో ప్రకంపనలు సృష్టిస్తోంది. పార్టీకోసం కష్టపడిన వారిని కాదని మరొకరికి సీటు కేటాయించారంటూ టీడీపీ నేతలు మండిపడుతున్నారు. ఈ క్రమంలో పలువురు టీడీపీకి రాజీనామా చేశారు. మరికొన్ని నియోజకవర్గాల్లోని నాయకులు అధిష్టానానికి అల్టిమేటం జారీ చేశారు.

టీడీపీకి గోవిందప్ప రాజీనామా



గోవిందప్ప

మడకశిర: జిల్లా టీడీపీ కురుబ సాధికార కమిటీ కన్వీనర్, స్థానిక న్యాయవాది గోవిందప్ప తన పదవికి, టీడీపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. టీడీపీలో కురుబలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆయన మండిపడ్డారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడుగా ఉన్న బీకే పార్థసారథికే టికెట్ ఇవ్వకుండా అవమానించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే మడకశిర నియోజకవర్గంలో టీడీపీ బలోపేతానికి మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఎంతో కష్టపడి పని చేసినా చంద్రబాబు పట్టించుకోలేదన్నారు. చంద్రబాబు వ్యవహారశైలి నచ్చక తాను పదవికి, పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు వెల్లడించారు. అలాగే టీడీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు భక్తర్ తన పదవికి రాజీనామా చేశారు. ఐదేళ్లుగా మడకశిర నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి మాజీ ఎమ్మెల్సీ గుండుమల ఎంతో కష్టపడి పని చేసినా చంద్రబాబు ఆయన్ను పట్టించుకోలేదన్నారు. చంద్రబాబు ఏకపక్ష నిర్ణయానికి వ్యతిరేకంగా తన పదవికి రాజీనామా చేసినట్లు ఆయన వెల్లడించారు.

టీడీపీకి 'వనం' గుడ్‌బై



వనం గంగిరెడ్డి

కదిరి: పెనుకొండ నియోజకవర్గ టీడీపీ టికెట్ ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథికి ఇవ్వకపోవడంతో ఆ పార్టీ సీనియర్ నాయకుడు, రెస్కో మాజీ చైర్మన్ వనం గంగిరెడ్డి టీడీపీకి రాజీనామా చేశారు. బీసీల పార్టీ అని చెప్పుకునే టీడీపీలో బీసీలకు స్థానం లేదన్నారు. వైఎస్సార్ సీపీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసైనా చంద్రబాబు బుద్ధి తెచ్చుకోవాలని ఆయన హితవు పలికారు.

అనంతలోనూ ఆందోళనలు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: టీడీపీ ప్రకటించిన అభ్యర్థుల జాబితాతో ఆ పార్టీలో అసమ్మతి రేగింది. తమ నేతకు సీటు ఇవ్వకపోవడంతో తమ్ముళ్లు భగ్గుమన్నారు. చంద్రబాబు ఫ్లెక్సీలు, టీడీపీ జెండాలు చింపివేశారు. చంద్రబాబు ఏకపక్ష నిర్ణయంపై మండిపడ్డారు. డబ్బుకు అమ్ముడుపోయాడంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

భగ్గుమన్న అసంతృప్తి జ్వాలలు

అభ్యర్థుల జాబితా ప్రకటనతో తెలుగుదేశం పార్టీలో అసంతృప్తి జ్వాలలు ఒక్కసారిగా ఎగిసిపడ్డాయి. కళ్యాణదుర్గంలో మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరి బహిరంగంగా తన అసమ్మతి తెలియజేశారు. ఎస్‌ఆర్‌సీ నిర్మాణ సంస్థ అధినేత సురేంద్రకు టికెట్ ఇచ్చారనే వార్త తెలుసుకున్న వెంటనే తన ఇంటివద్ద ఉన్న ఫ్లెక్సీలు, జెండాలు తీసేశారు. కనీసం తమ అభిప్రాయాలు తెలుసుకోకుండా ఏకపక్ష నిర్ణయాలు తీసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జెండాలన్నీ తీసి చెత్తలో పడేశారు. సీనియర్‌ను కాదని ఏకపక్షంగా అభ్యర్థి ఎంపికపై ఎలా నిర్ణయం తీసుకుంటారంటూ ఉన్నం కుమారుడు మారుతీ చౌదరి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే ఆయనకు పలువురు నాయకులు, కార్యకర్తలు సంఘీభావం తెలిపారు. కాంట్రాక్టర్ ఇచ్చే డబ్బుకు అమ్ముడు పోయారని తెలుగు తమ్ముళ్లు చంద్రబాబును తీవ్ర పదజాలంతో దూషించారు. రెండు రోజుల్లో పార్టీ కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించి భవిష్యత్తు కార్యాచరణను తెలియజేస్తామని ఉన్నం హనుమంతరాయ చౌదరి తెలిపారు.

ఆందోళన బాటలో మరికొందరు

చంద్రబాబు ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఇప్పటి వరకూ కేవలం 9 సీట్లు ప్రకటించారు. మిగతా 5 సీట్లు ప్రకటించాల్సి ఉంది. ముఖ్యంగా పల్లెరఘునాథరెడ్డి, కందికుంట ప్రసాద్, ప్రభాకర్ చౌదరి తదితరుల పేర్లు తొలి జాబితాలో కానరాలేదు. దీంతో వారంతా తీవ్ర అసంతృప్తికి లోనవుతున్నారు. అనంతపురం అర్బన్ సీటు జనసేనకు ఇచ్చే అవకాశముందని ప్రచారం జరుగుతుండడం, ఈ క్రమంలోనే ప్రకటించిన జాబితాలో తన పేరు లేకపోవడంతో వైకుంఠం ప్రభాకర్ చౌదరి లోలోనే రగిలిపోతున్నట్లు సమాచారం. ఇక పల్లె రఘునాథరెడ్డి, ప్రభాకర్ చౌదరి, జితేందర్‌గౌడ్‌లకు టికెట్లు అనుమానంగా ఉంది. మిగతా సీట్లు వెల్లడిస్తే అసంతృప్తి జ్వాలలు మరింతగా ఎగిసిపడే అవకాశం ఉంది.



మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరి కార్యాలయంలో చంద్రబాబు ఫ్లెక్సీలు చించివేసిన దృశ్యం

టీడీపీ కార్యాలయ కిటికీలు, ఫర్నీచర్ ధ్వంసం

గత ఎన్నికల్లో టీడీపీ తరఫున బరిలో నిలిచి ఓడిపోయిన బండారు శ్రావణికే మళ్లీ టికెట్ ప్రకటించడంతో ఆ పార్టీ శింగనమల టూమెన్ కమిటీ సభ్యులు ముంటిమడుగు కేశవరెడ్డి, ఆలం నరసానాయుడు వర్గీయులు రెచ్చిపోయారు. అనంతపురంలోని టీడీపీ కార్యాలయంపై శనివారం సాయంత్రం దాడి చేశారు. కిటికీ అద్దాలు ధ్వంసం చేశారు. కార్యాలయ ఆవరణలో కట్టిన ఫ్లెక్సీలను చించేశారు. చంద్రబాబు డౌన్ డౌన్... నారా లోకేష్ డౌన్ డౌన్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బండారు శ్రావణిని గెలవనివ్వబోమని స్పష్టం చేశారు. అవసరమైతే ఇండిపెండెంట్‌గా అభ్యర్థిని బరిలో దింపుతామన్నారు. ఒకట్రెండు రోజుల్లో టూమెన్ కమిటీ సభ్యులు ముంటిమడుగు కేశవరెడ్డి, ఆలంనరసానాయుడు, నాయకులు రామలింగారెడ్డి, పర్వతనేనిశ్రీధర్‌బాబు సమక్షంలో సమావేశం ఏర్పాటు చేసి ఒక నిర్ణయం తీసుకోనున్నారు.



అనంతపురంలోని టీడీపీ జిల్లా కార్యాలయం వద్ద చంద్రబాబు చిత్రంతో ఏర్పాటు చేసిన బోర్డును చించేసిన దృశ్యం

28న 'వైఎస్సార్ రైతు భరోసా' విడుదల

- పంట రుణాల సున్నావడ్డీ కూడా జమ



అనంతపురం అగ్రికల్చర్: 'వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్' పథకంలో భాగంగా వరుసగా ఐదో ఏడాది పెట్టుబడి సాయాన్ని ఈనెల 28న ప్రభుత్వం విడుదల చేయనుంది. రూ.2 వేల ప్రకారం రైతుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. దీంతో పాటు వైఎస్సార్ పంట రుణాల సున్నా వడ్డీ కింద 2022 ఖరీఫ్, రబీలో రూ. లక్ష లోపు రుణాలు తీసుకున్న రైతులకు వడ్డీ జమ చేయనున్నట్లు తెలిపారు. 2 పథకాల కింద రైతులకు పెద్ద మొత్తంలో ప్రయోజనం చేకూరనుందన్నారు. వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్ కింద అనంతపురం జిల్లాలో 2.94 లక్షల మంది రైతులకు రూ.58.80 కోట్లు, శ్రీ సత్యసాయి జిల్లాలో 2.80 లక్షల మంది రైతులకు రూ.56 కోట్లకు పైగా నగదు జమ అయ్యే అవకాశం ఉందన్నారు. గత జూన్‌లో ఖరీఫ్ కింద ఒక్కో రైతుకు రూ.7,500, అక్టోబర్‌లో రబీకి రూ.4 వేల ప్రకారం జమ చేయగా... తాజాగా తుది విడతగా రూ.2 వేల ప్రకారం ఇవ్వనున్నట్లు తెలిపారు. మొత్తంగా ఏటా రూ.13,500 ప్రకారం పెట్టుబడి సాయం అందనుంది. ఇందులో కేంద్రం వాటా రూ.6 వేలు కాగా, మిగిలిన రూ.7,500 రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోంది. కేంద్రంతో పనిలేకుండా కౌలు రైతులు, ఆటవీ, దేవాదాయ భూమి సాగు దారులకు పూర్తి స్థాయిలో పెట్టుబడి సాయాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు విడుదల చేస్తోంది. అలాగే పంట రుణాల సున్నావడ్డీ కింద వడ్డీ మాఫీ చేస్తోంది.

నేడు గ్రూప్-2 పరీక్ష

- జిల్లాలో 28 కేంద్రాలు, పరీక్ష రాయనున్న 8,230 మంది
- అభ్యర్థుల సౌకర్యార్థం ప్రత్యేక సర్వీసులు నడపనున్న ఆర్టీసీ

పుట్టపర్తి టౌన్: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) ఆధ్వర్యంలో గ్రూప్–2 పరీక్ష ఆదివారం జరగనుంది. జిల్లాకు చెందిన 8,239 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారు. జిల్లావ్యాప్తంగా 28 కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్ష ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరగనుంది. అభ్యర్థులు గంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. నిర్దిష్ట సమయం దాటిన తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతించబోమని అధికారులు స్పష్టం చేశారు. అభ్యర్థులు హాల్‌టికెట్‌తో పాటు ప్రభుత్వం జారీ చేసిన ఏదేని గుర్తింపు కార్డు (ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్, ఓటర్ ఐడీ, పాన్ కార్డ్, పాస్‌పోర్ట్ తదితర) తప్పనిసరిగా వెంట తెచ్చుకోవాలన్నారు. సెల్‌ఫోన్, ఎలక్ట్రానిక్ వస్తువులను కేంద్రంలోని అనుమతించబోమని అధికారులు స్పష్టం చేశారు.

ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

గ్రూప్–2 అభ్యర్థుల సౌకర్యార్థం ఆదివారం జిల్లాలోని అన్ని డిపోల నుంచి ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి (డీపీటీఓ) మధుసూదన్ తెలిపారు. ఈ మేరకు అన్ని డిపో మేనేజర్లు, ట్రాఫిక్ ఇన్‌చార్జ్‌లకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ధర్మవరం– అనంతపురం, కదిరి– అనంతపురం, కదిరి– హిందూపురం, పెనుకొండ– అనంతపురం రూట్లలో ప్రతి 15 నిమిషాలకు ఒక సర్వీసు నడిచేలా చర్యలు తీసుకున్నామన్నారు. అలాగే హిందూపురం– అనంతపురం, అనంతపురం–పుట్టపర్తి, ధర్మవరం– హిందూపురం, మడకశిర– హిందూపురం, మడకశిర– పెనుకొండ తదితర రూట్లలో ప్రతి 20 నిమిషాలకు ఒక బస్సు నడపనున్నట్లు వెల్లడించారు. రద్దీకి అనుగుణంగా జిల్లాలోని అన్ని డిపోల నుంచి ప్రత్యేక సర్వీసులు నడపుతామన్నారు.

క్లుప్తంగా

మర్రిమానును సందర్శించిన తెలంగాణ మాజీ సీఎస్


మర్రిమాను విశిష్టత తెలుసుకుంటున్న మాజీ సీఎస్ కుటుంబ సభ్యులు

ఎన్పీకుంట: తెలంగాణ మాజీ చీఫ్ సెక్రటరీ సోమేష్‌కుమార్ కుటుంబ సభ్యులతో శనివారం ఎన్పీకుంట మండలం గూటిబైలులో గల తిమ్మమ్మ మర్రిమానును సందర్శించారు. తిమ్మమాంబ ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు స్వాగతం పలికి, సత్కరించారు. ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మర్రిమాను విశిష్టతను, ఆలయ చరిత్రను టూరిజం గైడ్ మనోహర్, అనిల్‌రాయల్ ద్వారా తెలుసుకున్నారు. తిమ్మమ్మ మర్రిమాను సమీపంలోని ఈశ్వరమలై కొండపై ఈశ్వరుని దేవాలయానికి రంగులు వేయిస్తానని మాజీ సీఎస్ హామీ ఇచ్చినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో గాండ్లపెంట తహసీల్దార్ శ్రావణి, ఎన్పీ కుంట డీటీ రవినాయక్, వీఆర్‌ఓ కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి అనుమానాస్పద మృతి


మృతి చెందిన నాగరాజు

అమరాపురం: నడలూడం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు నాగరాజు (62) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మృతుడి భార్య, పోలీసులు తెలిపిన వివరాల మేరకు... నాగరాజు శనివారం ఉదయం 8 గంటల సమయంలో కర్ణాటక రాష్ట్రం చెళ్లికెర తాలుకా పరాశురామపురం ఓబళి, మహదేవపురం పంచాయతీ పరిధిలోని కడేహుడే పొలిమేరలో గల తోట వద్దకు వెళ్లి వస్తాన ఇంట్లో చెప్పి వెళ్లాడు. మధ్యాహ్నమైనా తిరిగి ఇంటికి రాలేదు. దీంతో భార్య తోట వద్దకెళ్లి చూడగా కంప చెట్ల మధ్య నాగరాజు విగతజీవిగా పడి ఉన్నాడు. వెంటనే ఆమె గ్రామంలోని వారికి సమాచారం తెలిపింది. వారు వచ్చి చూడగా నాగరాజు అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. ఎడమ చెవి పైభాగం, మర్మాంగం వద్ద రక్తస్రావమై ఉండటంతో మృతిపై అనుమానాలు ఉన్నాయని భార్య పార్వతమ్మ తెలిపింది. తోట కర్ణాటక ప్రాంతంలో ఉండడంతో పరాశురామపురం పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

- నాగరాజు మృతి పట్ల వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వాగేష్, రొళ్ల జెడ్పీటీసీ అనంతరాజు, కుంచిటి వక్కలిగ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ వీరక్యాతరాయప్ప, సర్పంచ్ నాగవేణి సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, ధైర్యం చెప్పారు.

టీడీపీ ఓట్ల దొంగాట

- ఒక్కొక్కరికి రెండు నుంచి మూడు ఓట్లు
- బత్తలపల్లి మండల వ్యాప్తంగా ఇదే తంతు
- పథకం ప్రకారం దొంగ ఓట్లు పోకుండా జాగ్రత్తలు
- టీడీపీ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి అధికారుల ప్రేక్షకపాత్ర
- వైఎస్సార్‌సీపీ మద్దతుదారుల ఓట్ల తొలగింపునకు కుట్రలు
- సమగ్ర విచారణ జరిపి దొంగ ఓట్లని అరికట్టాలని ప్రజా సంఘాల వినతి


గోనుగుంట్ల లక్ష్మీనారాయణ పేరిట నార్పింపల్లి, సంగాల గ్రామాల్లో ఓట్లు


గోనుగుంట్ల హరిప్రసాద్ పేరిట కునుకుంట్ల, సంగాలలో రెండు జాబితాలలో ఉన్న ఓట్లు


గంగాధర పేరిట వేల్పుమడుగు, సంగాలలో రెండు జాబితాలలో ఉన్న ఓట్లు



ధర్మవరం: తెలుగుదేశం పార్టీ ఎన్నికల్లో గెలవడం కోసం అడ్డదారులు ఎంచుకుంటోంది. ధర్మవరం నియోజకవర్గంలో తమకు అనుకూలంగా భారీగా దొంగ ఓట్లను జాబితాలో చేర్పించింది. బత్తలపల్లి మండలంలో మాజీ ఎమ్మెల్యే వరదాపురం సూరీ స్వంత పంచాయతీ అయిన సంగాలలోనే 200 దాకా దొంగ ఓట్లు చేర్చుకున్నారు. ఇక సంజీవపురం, వేల్పుమడుగు, బత్తలపల్లి మండల కేంద్రంలో అయితే దొంగ ఓట్ల సంఖ్య వేలల్లోనే ఉంది. ప్రజలు దొంగ ఓట్లపై ఫిర్యాదు చేస్తే వారిని టీడీపీ నాయకులు భయభ్రాంతులకు గురి చేయడం, జాబితా నుంచి తొలగించకుండా ఎన్నికల సిబ్బందిని బెదిరించడం చేస్తున్నారు. బీఎల్‌ఓల ఇంటి వద్దకు వెళ్లి తమ పార్టీ సానుభూతిపరుల దొంగ ఓట్లు తొలగించకూడదని తీవ్రమైన ఒత్తిడి తెచ్చి బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతున్నారు. దీంతో ఏం చేయాలో దిక్కుతోచక దొంగ ఓట్ల ఫిర్యాదులను ఎన్నికల సిబ్బంది బుట్టదాఖలు చేస్తున్నారు. నియోజకవర్గంలో దొంగ ఓట్ల సంఖ్య 8వేలకు పైగానే ఉంది. ఇవన్నీ టీడీపీకి చెందిన వారివే. పునాదులు, ఖాళీ స్థలాలను చిరునామాగా చూపించి ఓటరు జాబితాలో పేర్లు చేర్చారు.

వైఎస్సార్‌సీపీ మద్దతుదారుల ఓట్ల తొలగింపే లక్ష్యం..

ఈ యేడాది ఎన్నికల సంవత్సరం కావడంతో ఎన్నికల కమిషన్ ఫాం-6, ఫాం-7లను పరిశీలించి గత జనవరి 28వ తేదీన తుది జాబితా విడుదల చేసింది. అయినప్పటికీ వేల సంఖ్యలో వైఎస్సార్‌సీపీ మద్దతుదారుల ఓట్ల తొలగింపే లక్ష్యంగా టీడీపీ నాయకులు ఫాం-7 కింద ఇబ్బడి ముబ్బడిగా దరఖాస్తు చేస్తూ ఎన్నికల సిబ్బందిపై తీవ్రమైన ఒత్తిడి తెస్తున్నారు. ఈ ముసుగులో దరఖాస్తులు విచారణ చేయకుండా వైఎస్సార్‌సీపీ ఓట్లు తొలగించేలా కుట్రలు చేస్తున్నారు. తుది జాబితా విడుదల చేసినప్పటి నుంచి ఇప్పటి వరకు ఫాం-6 (కొత్త ఓటు కోసం) 7,205 దరఖాస్తులు, ఫాం-7 (ఓట్ల తొలగింపు) 6,120 దరఖాస్తులు వచ్చాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

తలారి నారాయణస్వామిపై కేసు

ధర్మవరం సబ్‌జైల్‌లో రిమాండ్ ఖైదీగా ఉంటూ గొట్లూరులో ఫాం-7 దరఖాస్తు చేసి కుట్ర చేసిన తలారి నారాయణస్వామిపై అధికారులు చర్యలు తీసుకున్నారు. తప్పుడు ఆరోపణలు, కుట్ర కోణంతో అధికారులను పక్కదారి పట్టించిన నారాయణస్వామిపై ధర్మవరం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఐపీసీ 419, 66డీలతో పాటు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగేంద్ర తెలిపారు.

- తాడిమర్రి మండలం నార్శింపల్లిలో నివాసం ఉండే గోనుగుంట్ల లక్ష్మీనారాయణ మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ (వరదాపురం సూరీ)కి స్వయాన చిన్నాన్న. ఇతడు నార్శింపల్లిలో (ఎల్‌టీసీ3862679) ఓటు హక్కు కల్గి ఉన్నాడు. ఇదే వ్యక్తికి వరదాపురం సూరీ సొంత పంచాయతీ బత్తలపల్లి మండలం సంగాలలో (డబ్ల్యూఏయూ 2359552) మరో ఓటుంది.
- తాడిమర్రి మండలం నార్శింపల్లిలో నివాసం ఉండే గోనుంట్ల హరిప్రసాద్.. మాజీ ఎమ్మెల్యే వరదాపురం సూరీ వరుసకు చిన్నాన్న కొడుకు అవుతాడు. ఇతడికి గ్రామంలో డబ్ల్యూఏయూ1473008 నంబరుతో జాబితాలో ఓటు ఉంది. ఇదే వ్యక్తికి బత్తలపల్లి మండలం సంగాలలో డబ్ల్యూఏయూ0382754తో మరో ఓటు కల్గి ఉన్నాడు.
- బత్తలపల్లి మండలం వేల్పుమడుగులో నివాసం ఉంటే తలారి వెంకటేశ్‌కు డబ్ల్యూఏయూ0207571తో గ్రామంలో ఓటు హక్కు ఉంది. ఇదే వ్యక్తికి అదే మండలం అప్రాశ్చెర్వు పంచాయతీలో రెండు చోట్ల (ఎల్‌టీసీ3932811, డబ్ల్యూఏయూ 1266239) ఓటు హక్కు కల్గి ఉన్నాడు.
- బత్తలపల్లి మండలం వేల్పుమడుగుకు చెందిన దొమ్మర గంగాధర్‌కు డబ్ల్యూఏయూ 1887801 నంబరుతో గ్రామంలో ఒకటి, సంగాలలో డబ్ల్యూఏయూ 1132661 నంబర్‌తో మరొక ఓటు ఉంది.
- వేల్పుమడుగులో వెంకటరాముడు దొమ్మర (డబ్ల్యూఏయూ 12045050) పేరిట ఓటరు జాబితాలో నమోదైంది. ఇదే వ్యక్తి సంగాలలో (డబ్ల్యూఏయూ 1132695) మరొక ఓటు హక్కు కలిగి ఉన్నాడు.

ఇవి మచ్చుకు ఉదాహరణలే.. ఒకటికి మించి ఉన్న ఓట్లను తొలగించాల్సిన అధికారులు టీడీపీ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి ప్రేక్షకపాత్ర వహించడం గమనార్హం.

దొంగ ఓట్లు తొలగించాలి



మా పంచాయతీ పరిధిలో 200కు పైగా దొంగ ఓట్లు ఉన్నాయి. టీడీపీ సానుభూతిపరులు వేరే ప్రాంతాల్లో ఉంటూ కూడా ఇక్కడ దొంగ ఓట్లు ఎక్కించుకున్నారు. ఒక్కొక్కరికి రెండు, మూడు ఓట్లు ఉన్నాయి. టీడీపీ నాయకులు ఎన్నికల సిబ్బందిపై ఒత్తిడి తేవడంతో దొంగ ఓట్లను తొలగించలేదు. ఉన్నతాధికారులు విచారణ జరిపి దొంగ ఓట్లు తొలగించాలి.
– రాజశేఖర్‌రెడ్డి, సర్పంచ్, సంగాల పంచాయతీ, బత్తలపల్లి మండలం

ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు



బత్తలపల్లి మండలంలో వేల సంఖ్యలో దొంగ ఓట్లు ఉన్నాయి. ఆధారాలతో సహా ఫాం-7 దరఖాస్తులో పొందుపరచి ఫిర్యాదు చేసినా.. సదరు ఓట్లు తొలగించడంలో ఎన్నికల సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఎన్నికల సిబ్బందిని టీడీపీ నాయకులు బెదిరిస్తూ, ఓట్లు తొలగించకుండా చూస్తున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలి.
– సూర్యనారాయణరెడ్డి, సంగాల గ్రామం

కఠిన చర్యలు తీసుకుంటాం



బత్తలపల్లి మండలంలో దొంగ ఓట్లపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నాం. ప్రతి దరఖాస్తునూ క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతనే ఆమోదిస్తున్నాం. ఓట్ల తొలగింపు, వడపోత ప్రక్రియలో రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా సిబ్బందికి ఆదేశాలిచ్చి పారదర్శకంగా విధులు నిర్వర్తించేలా చర్యలు చేపట్టాం. దొంగ ఓట్లు కల్గి ఉన్న వారిపై కఠిన చర్యలు తప్పవు.
–శివశంకర్ నాయక్, తహసీల్దార్, బత్తలపల్లి

భార్యపై బెంగతో భర్త ఆత్మహత్య

మడకశిరరూరల్: భార్య మరణాన్ని జీర్ణించుకోలేక భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మడకశిర మండలంలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. సిద్ధగిరి గ్రామానికి చెందిన హనుమంతప్ప కుమారుడు గిరి (44) బెంగళూరుకు వలస వెళ్లి అక్కడ ఒక ఫ్యాక్టరీలో పని చేసేవాడు. అక్కడ పరిచయమైన ఓ అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడు. నాలుగు రోజుల క్రితం ఆమె మృతి చెందింది. అప్పటి నుంచి బెంగతో ఉన్న గిరి శుక్రవారం రాత్రి స్వగ్రామానికి సమీపంలో ఉన్న కె.పాళ్యం వద్ద చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించాలి


మాట్లాడుతున్న మోడల్ స్కూళ్ల జేడీ వెంకటకృష్ణారెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: పదో తరగతి, ఇంటర్ పరీక్షలు రాయనున్న విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించాలని ఏపీ మోడల్ స్కూళ్ల జాయింట్ డైరెక్టర్ వెంకటకృష్ణారెడ్డి సూచించారు. ఉమ్మడి అనంతపురం, కర్నూలు జిల్లాల్లోని మోడల్ స్కూళ్లలో పదోతరగతి, ఇంటర్ పరీక్షలకు విద్యార్థుల సన్నద్ధతపై ప్రిన్సిపాళ్లు, సబ్జెక్టు టీచర్లతో అనంతపురంలోని పంగల్‌రోడ్డు ఆర్డీటీ ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ స్కూల్‌లో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన వెంకట కృష్ణారెడ్డి మాట్లాడుతూ అన్ని సబ్జెక్టులూ ముఖ్యంగా గణితం, సైన్స్‌లో విద్యార్థుల వెనుకబాటుతనాన్ని గుర్తించారు. ఆయా సబ్జెక్టుల్లో విద్యార్థులు ప్రావీణ్యం సాధించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పదోతరగతి, ఇంటర్ విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేకంగా అధ్యయన తరగతులు నిర్వహించాలన్నారు. విద్యార్థుల పురోగతిని అంచనా వేయడానికి ప్రిన్సిపాల్స్/ఉపాధ్యాయులు రెగ్యులర్ ప్రాతిపదికన స్లిప్ టెస్టులు నిర్వహించాలన్నారు. అదే రోజున మూల్యాంకనం చేసి విద్యార్థులకు అందజేయాలన్నారు. పరీక్షలలో 100 శాతం ఫలితాలు సాధించేందుకు అందరూ కృషి చేయాలని కోరారు. సమావేశంలో డీఈఓ వరలక్ష్మి, అసిస్టెంట్ డైరెక్టర్ నాగరాజు, రాష్ట్ర కార్యాలయ సీబీఎస్‌ఈ కోఆర్డినేటర్ శ్రీలత, ఏఎంఓ, అసిస్టెంట్ ఏఎంఓలు ధర్మకుమార్, శరత్, శ్రీసత్యసాయి జిల్లా ఏడీ రామకృష్ణ, డీసీఈబీ కార్యదర్శి పురుషోత్తం బాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు క్రిటికల్ కేర్ యూనిట్ ప్రారంభం

పుట్టపర్తి అర్బన్: హిందూపురం పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో రూ.23 కోట్లతో నిర్మించిన 50 పడకల క్రిటికల్ కేర్ యూనిట్‌ను వర్చువల్ విధానంలో ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం ప్రారంభించనున్నారు. అలాగే హిందూపురం రైల్వేస్టేషన్‌ను అమృత్ స్టేషన్ జాబితాలో చేర్చి రూ.15కోట్ల నిధులతో ఆధునీకరణ చేయనున్నారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జి దగ్గర లిఫ్ట్ సౌకర్యం, పార్కింగ్ లాంటి కార్యక్రమాలను ప్రధాని ప్రారంభించనున్నారు.

ఆర్టీసీ డిపోలో డ్రైవింగ్ స్కూల్

అనంతపురం క్రైం: అనంతపురం ఆర్టీసీ డిపోలో హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ స్కూల్ ప్రారంభించనున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి సుమంత్ ఆర్ ఆదోని తెలిపారు. ఇందుకు సంబంధించి ఈ నెల 29వ తేదీన కొత్త బ్యాచ్‌కు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఒక్కో బ్యాచ్‌లో 16 మందికి అవకాశం ఉంటుందన్నారు. శిక్షణ పొందాలనుకునేవారు 99592 25853, 79898 00870 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఆర్బీకే అసిస్టెంట్ల బదిలీకి గ్రీన్ సిగ్నల్

అనంతపురం అగ్రికల్చర్: సచివాలయ వ్యవస్థలో భాగంగా ఆర్బీకేలో నియమితులైన వ్యవసాయ, ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ విలేజ్ అసిస్టెంట్ల బదిలీకి ఉత్తర్వులు వచ్చినట్లు వ్యవసాయ శాఖ వర్గాలు తెలిపాయి. ప్రధానంగా అంతర్ జిల్లాల పరిధిలో బదిలీలు ఉంటాయని పేర్కొన్నాయి. ఈ నెల 29లోపు బదిలీల ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశాలు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

రైలు ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు

- డివిజన్‌లో 15 'అమృత్ భారత్' స్టేషన్లకు శంకుస్థాపన
- వర్చువల్ విధానంలో ప్రారంభించనున్న ప్రధాని మోదీ

గుంతకల్లు: రైలు ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు డివిజనల్ రైల్వే మేనేజర్ (డీఆర్ఎం) వినీత్‌సింగ్ పేర్కొన్నారు. అమృత్ భారత్ స్టేషన్ల పథకం కింద గుంతకల్లు డివిజన్ వ్యాప్తంగా 15 రైల్వేస్టేషన్ల ఆధునీకరణ పనులకు శంకుస్థాపన చేయడంతోపాటు దాదాపు 24 రోడ్ అండర్ బ్రిడ్జీలను ప్రారంభించి జాతికి అంకితం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన సీనియర్ డీసీఎం మనోజ్, డీసీఎం జీ.సోమశేఖర్‌నాయుడుతో కలిసి శనివారం ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. రైల్వేస్టేషన్ల ఆధునీకరణకు వేగవంతమైన ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. ఈ స్టేషన్లలో లిఫ్టులు, విశాలమైన వెయిటింగ్ హాల్స్, కొత్త ప్లాట్‌ఫామ్‌లు, పార్కింగ్ ప్లేస్‌లు తదితర అభివృద్ధి పనులతోపాటు స్టేషన్ భవనం ఆధునీకరిస్తున్నట్లు వెల్లడించారు. డివిజన్ పరిధిలోని ఆదోని, అనంతపురం, ధర్మవరం, డోన్, చిత్తూరు, పాకాల, రాజంపేట, కడప, తాడిపత్రి, మదనపల్లి, శ్రీకాళహస్తి, మంత్రాలయం, గుత్తి, రాయచూర్, యాదగిరి రైల్వేస్టేషన్లను ఈ పథకం కింద ఆధునీకరిస్తున్నట్లు తెలిపారు. దీంతో రైల్వేస్టేషన్ల రూపురేఖలు మారిపోయి ప్రయాణికులకు కొత్త అనుభూతి కల్గిస్తాయని పేర్కొన్నారు. అదేవిధంగా అన్నమయ్య, కడప, అనంతపురం, కర్నూలు, తిరుపతి, చిత్తూరు, తెలంగాణలోని నారాయణపేటలో దాదపు 24 రోడ్డు ఓవర్ బ్రిడ్జీలు, రోడ్డు అండర్ బ్రిడ్జీల నిర్మాణం పూర్తి చేసినట్లు వివరించారు. ఆదివారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ వీడియో లింక్ ద్వారా వీటిని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రైలు ప్రయాణికులు పెద్దఎత్తున్న పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

• నమో వేంకటేశ..

- నేత్రపర్వంగా పేట వేంకటరమణస్వామి రథోత్సవం


గోవింద నామస్మరణతో రథాన్ని లాగుతున్న భక్తులు

హిందూపురం: అశేష భక్తజన సందోహం నడుమ పేట వేంకటరమణస్వామి బ్రహ్మరథోత్సవం శనివారం నేత్రపర్వంగా సాగింది. ఉదయం మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాలు, బంగారు కవచధారణ, విశేష పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. నమో వేంకటేశ.. వేంకటరమణ రమణ గోవిందా.. గోవింద నామస్మరణతో ఆలయ ప్రాంగణం, మెయిన్‌రోడ్డు ప్రాంతం మార్మోగింది. మధ్యాహ్నం 12 గంటల తర్వాత రథోత్సవ కార్యక్రమాలు ప్రారంభమై సాయంత్రం 4 గంటల వరకు కొనసాగాయి. వేదపండితులు ముందుగా రథాంగ హోమం నిర్వహించి శాంతిపూజలు జరిపారు. తర్వాత కొల్హాపూరి అమ్మవారి ఆలయం నుంచి రథోత్సవ కమిటీ సభ్యులు, పట్టణ ప్రముఖులు భక్తులు మేళతాళాలతో ఉత్సవ మూర్తులను పల్లకీలో తీసుకొచ్చి ఆలయంలో కొలువుదీర్చి పూజలు చేశారు. తర్వాత శ్రీదేవి, భూదేవి సమేత వేంకటరమణ స్వామి ఉత్సవ మూర్తులను పల్లకీలో విశేషంగా అలంకరించి మేళతాళాలతో ప్రాకారోత్సవం నిర్వహించి నేరుగా రథం వద్దకు తీసుకువచ్చి కొలువుదీర్చారు. భక్తులు గోవిందా.. గోవింద అంటూ కరతాళ ధ్వనులతో స్వాగతించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ సమన్వయకర్త బోయ శాంతమ్మ, అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక, ఏపీ అగ్రోస్ చైర్మన్ నవీన్ నిశ్చల్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ తదితరులు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.


రథాన్ని లాగుతున్న భక్తులు


ప్రత్యేక అలంకరణలో స్వామివారు

వైభవంగా బ్రహ్మ రథోత్సవం

అమరాపురం: మండల కేంద్రం అమరాపురంలో శ్రీ ప్రసన్న లక్ష్మీ వెంకటేశ్వరస్వామి బ్రహ్మ రథోత్సవం శనివారం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం స్వామి వారికి అర్చకులు రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం తదితర పూజలు చేశారు. అనంతరం మహా మంగళ హారతి ఇచ్చారు. రథం ముందు అర్చకులు శాంతి, గణ, వాస్తు తదితర హోమాలు నిర్వహించారు. మధ్యాహ్నం స్వామి ఉత్సవ విగ్రహాన్ని మేళతాళాలతో ఆలయ కమిటీ సభ్యులు భక్తులు, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో తీసుకొచ్చి.. పూజల అనంతరం రథంలో కొలువుదీర్చారు. భక్తులు ఆలయం వద్ద నుంచి రథాన్ని కెనరా బ్యాంకు సమీపం వరకూ లాగారు. అరటి పండు, బెల్లం, బొరుగులు, పూలు తదితర వాటిని రథం పైకి విసిరి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అన్నదానం, ప్రసాదం వినియోగం చేశారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్‌ఐ జనార్ధననాయుడు పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.